# పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో రిష్కరిస్తాం

మొదటి పేజీ తరువాయి

**లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి:**

శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన వాడీవేడి చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు. ధరణి పోర్టల్ రూపకల్పన వెనుక రూ. లక్షల కోట్ల విలువైన ఆస్తుల బదిలీ మతలబు దాగి ఉందని ఆరోపించారు. "రైతుల భూములకు రక్షణ కల్పిస్తామని చెప్పి, వేల ఎకరాల నిషేధిత భూములను అక్రమంగా విముక్తి చేసి కొందరి చేతుల్లో పెట్టారు. ధరణి పేరిట సాగిన దోపిడీ సాధారణమైనది కాదు. ఈ అక్రమాలకు సంబంధించి ఏయే భూములు ఎవరెవరి చేతుల్లోకి వెళ్లాయో సమగ్ర వివరాలను, పూర్తి ఆధారాలతో సహా సభ ముందు ఉంచుతాం" అని స్పష్టం చేశారు.సమస్యల మూలాలు నిజాం కాలం నాటివి: ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలు రాత్రికి రాత్రే పుట్టుకొచ్చినవి కావని, నిజాం సర్కారు కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వరకు.. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భావం అనంతరం కోర్టు తీర్పుల దాకా కొనసాగిన చారిత్రక పరిణామాలని సీఎం వివరించారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు, నిర్లక్ష్యం వల్ల 22ఏ జాబితా అంతుచిక్కని సమస్యగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను వేధిస్తోందంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా సమస్య మూలాలను



అన్వేషించి, శాశ్వత పరిష్కారం చూపడానికే తాము శాసనసభలో ఈ చర్చను స్వచ్ఛందంగా లేవనెత్తామని వెల్లడించారు.

**మంత్రి పొంగులేటిపై కక్షపూరిత ప్రచారం :**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై విపక్షాలు కావాలనే విషప్రచారం చేస్తున్నాయని సీఎం రేవంత్ మండిపడ్డారు. "పొంగులేటి ఏదో భూతంలా మారి ప్రజల భూములను మింగేస్తున్నారంటూ అసత్యాలను వండి వారుస్తున్నారు. ప్రజా సమస్యలకు శ్రీనివాస్‌రెడ్డి వ్యక్తిగతంగా కారణం కాదు; ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎంత బాధ్యుడో, యావత్ ప్రభుత్వం కూడా అంతే బాధ్యత వహిస్తుంది" అని ప్రభుత్వ సమిష్టి బాధ్యతను స్పష్టం చేశారు.తప్పులు బయటపడతాయనే విపక్షాల పరార్ : అసెంబ్లీలో వాస్తవాలు మాట్లాడేందుకు ప్రధాన ప్రతిపక్షం వెనుకడుగు వేసిందని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, 22ఏ జాబితాలోని అక్రమాలపై చర్చ జరిగితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ లోపాలు, కుంభకోణాలు బట్టబయలవుతాయనే భయంతోనే ప్రతిపక్ష నేత సభకు రాకుండా ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. తాము బాధ్యత నుంచి పారిపోయే ప్రసక్తే లేదని, ప్రజల ఆస్తులను కాపాడటమే ధ్యేయమని తేల్చిచెప్పారు.

**సభా మర్యాదలు గాలికొదిలేస్తే ఉపేక్షించేది లేదు:**

స్పీకర్‌దే తుది నిర్ణయం : సభ నియమ నిబంధనలు, స్పీకర్ అధికారాల ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి సభ్యుడి ప్రాథమిక కర్తవ్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తికి పార్టీలతో సంబంధాలు తెగిపోతాయని, ఆయన సభలోని ప్రతి సభ్యుడి హక్కులను పరిరక్షిస్తారని గుర్తుచేశారు. అసెంబ్లీలోకి ప్లకార్డులు, నినాదాల ఫ్లెక్సీలు, నిరసన దుస్తులతో రాకూడదనే నిబంధన గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటైందని.. రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ అయినా సరే స్పీకర్ ఆదేశాలను శిరసావహించాల్సిందేనని స్పష్టం చేశారు. శాసనసభ ప్రాంగణంలో పోలీసులను దూషించడం, మహిళా సిబ్బందిని కించపరిచేలా వ్యవహరించడం, అర్ధనగ్న ప్రదర్శనలతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. సభా మర్యాదలకు తిలోదకాలిచ్చిన సభ్యులు క్షమాపణ చెప్పాలని కోరినా వినకపోవడంతోనే వారిపై సస్పెన్షన్ వేటు పడిందని రేవంత్ వివరించారు.

# భారత్‌లో ఉప్పు ఉత్పత్తి సంక్షోభం

మొదటి పేజీ తరువాయి

గుజరాత్‌లోని కచ్ ఎడారి ప్రాంతం, తమిళనాడులోని తూత్తుకుడి, మరక్కాణం వంటి తీరప్రాంతాల్లోని ఉప్పు క్షేత్రాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. అకాల వర్షాలు కురవడం వల్ల మడుల్లోని ఉప్పునీటి గాఢత తగ్గిపోతోంది. దీంతో నీరు ఆవిరయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. కొన్నిసార్లు, తయారైన ఉప్పు స్ఫటికాలు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి కాలం తగ్గిపోవడమే కాకుండా, దిగుబడి కూడా గణనీయంగా పడిపోతోంది. గుజరాత్‌లో రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభం కావడం లేదా ఎక్కువ కాలం కురవడం వల్ల ఉప్పు తయారీ సీజన్ ఆలస్యమవుతోంది. తమిళనాడులోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో, కొన్నిసార్లు అక్కడి వ్యాపారులు గుజరాత్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.లిటిల్ రాణ్ ఆఫ్ కచ్‌లోని ఉప్పు రైతులపై 2026లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. మారుతున్న వర్షపాత సరళి, విపరీతమైన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయని తేలింది. ఉష్ణోగ్రతలలో మార్పులు కూడా నీరు ఆవిరయ్యే వేగాన్ని, స్ఫటికాల ఏర్పాటును ప్రభావితం చేస్తున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. తీర ప్రాంతాల్లో తుపానులు, బలమైన గాలులు మరో పెను సవాలుగా మారాయి. రైతులు తమ మడుల చుట్టూ గట్లు నిర్మించుకుని రక్షణ చర్యలు తీసుకుంటున్నా, అవి పెద్ద వర్షాలు, వరదల ముందు నిలవలేకపోతున్నాయి.

సమస్యను అధిగమించేందుకు పరిశోధనా సంస్థలు ప్రత్యామ్నాయ టెక్నాలజీలపై దృష్టి సారించాయి. ప్రతికూల వాతావరణంలోనూ నీటిని వేగంగా ఆవిరి చేసే పద్ధతులపై ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే, ఈ టెక్నాలజీలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. పెద్ద ఎత్తున క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశీయ ఉప్పు ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పింఛన్ దరఖాస్తుదారులకు శుభవార్త..

మొదటి పేజీ తరువాయి

**అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని**
**మంత్రి కొండపల్లి సూచన**
**స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో**
**కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ**

గడువు పొడిగింపుపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారిక ప్రకటన చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. సెలవులు లేదా ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, ఈ రెండు రోజుల అదనపు సమయంలో తమ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు' కేంద్రాల్లో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ పూర్తి చేసిన తర్వాత దరఖాస్తుదారులకు రసీదులను అందజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ.4,000లకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000లకు పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 61.92 లక్షల మంది ప్రతినెలా పింఛన్లు అందుకుంటున్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కొత్త లబ్ధిదారులకు పింఛన్లను మంజూరు చేయనున్నారు.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్..

మొదటి పేజీ తరువాయి

**22 శాతం వర్షపాతం లోటు, పెరిగిన**
**వినియోగమే ప్రధాన కారణం**
**కుత్బుల్లాపూర్‌లో ఏకంగా 39 మీటర్లకు**
**పడిపోయిన నీటిమట్టాలు**
**ఈ నెల వర్షాలు లేకుంటే తీవ్ర నీటి కష్టాలు**
**తప్పవని హెచ్చరిక**

భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన..

మొదటి పేజీ తరువాయి

**రాష్ట్రంలో కొనసాగుతున్న 19 శాతం**
**వర్షపాత లోటు**
**హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు**
**వర్షాల అంచనా**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సెప్టెంబరు 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా 19, 20 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు.భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించి, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాల్సి వస్తే, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు.ఈ వర్షాలు రాష్ట్రంలో నెలకొన్న వర్షపాత లోటును కొంతమేర తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కంటే 19 శాతం వర్షపాత లోటు నమోదైంది. సెప్టెంబరు నెలలోనే ఇప్పటివరకు 28 శాతం లోటు ఉంది. ఇక హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని, పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# నగరంలోకి దూరప్రాంత బస్సులకు 'నో' ఎంట్రీ..

మొదటి పేజీ తరువాయి

**శివార్లకే పరిమితం కానున్న దూరప్రాంత, ప్రైవేట్ బస్సులు**
**టెర్మినళ్ల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్‌తో లాస్ట్ మైల్ కనెక్టివిటీ**
**రవాణా వ్యవస్థ బలోపేతానికి 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు**

మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీ నగర్, ఘట్‌కేసర్‌లలో ఆధునిక టెర్మినళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు, అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చే సర్వీసులు ఇకపై నగరంలోకి ప్రవేశించకుండా ఈ టెర్మినళ్ల వద్దే తమ ప్రయాణాన్ని ముగిస్తాయి. అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు చేరవేసేందుకు పటిష్టమైన 'లాస్ట్-మైల్ కనెక్టివిటీ' ఏర్పాటు చేస్తారు.ఈ టెర్మినళ్ల నుంచి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు టీజీఎస్‌ఆర్టీసీ సిటీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను అనుసంధానించనున్నట్టు మంత్రి వివరించారు. ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులను కూడా ఈ కొత్త నిబంధనల పరిధిలోకి తీసుకురానున్నారు. నిర్దేశిత టెర్మినళ్ల నుంచే అవి కూడా నడపాల్సి ఉంటుంది. టెర్మినళ్లను వినియోగించుకున్నందుకు ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి రుసుము వసూలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.ఈ టెర్మినళ్ల నిర్మాణానికి అవసరమైన భూమిని కూడా గుర్తించామని, గాజులరామారంలో 100 ఎకరాలు, శంషాబాద్ వద్ద 150 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నామని పొన్నం తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి చెప్పారు. ఈ టెర్మినల్ ఆధారిత వ్యవస్థతో నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీలో 100 మెడికల్ షాపులపై దాడులు!

మొదటి పేజీ తరువాయి

**జంగారెడ్డిగూడెంలో భారీ రాకెట్ వెలుగులోకి, ఐదుగురి అరెస్ట్**
**ఒకే ఏజెన్సీ నుంచి 7,550 ఇంజెక్షన్ల స్వాధీనం**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పరిధిలోని వేగవరం గ్రామంలో గల ఒక ఆయిల్ పామ్ తోటలో వాడేసిన ట్రామడాల్ ఇంజెక్షన్లు, సిరంజిలు పెద్ద ఎత్తున లభించడంతో ఈ దందా గుట్టురట్టయింది. ఈ ఆధారాలతో లోతైన దర్యాప్తు చేపట్టిన అధికారులు, భారీ స్థాయిలో అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. డ్రగ్ కంట్రోల్ అధికారుల ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో మెడికల్ షాపుల యజమానులు కూడా ఉండటం గమనార్హం. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ ఇలాంటి భారీ అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు.విచారణలో భాగంగా జంగారెడ్డిగూడెంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ ఈ ఏడాది సుమారు 20 వేల ఇంజెక్షన్లను కొనుగోలు చేసినట్లు, అయితే వాటికి సంబంధించిన అమ్మకాల రికార్డులను చూపడంలో విఫలమైనట్లు అధికారులు గుర్తించారు. నిందితుడి స్నేహితుడికి చెందిన వడ్రంగి షాపులో నిల్వ చేసిన 7,550 ఇంజెక్షన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, డీ రూప పెద్దింటి అనే మరో ఏజెన్సీ 5,200 ఇంజెక్షన్లు కొనుగోలు చేసి, తెలంగాణలోని ఒక ఫార్మసీకి 3,930 ఇంజెక్షన్లను విక్రయించినట్లు నకిలీ బిల్లులు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది."అక్రమ రవాణా, అనధికారిక నిల్వ, సరైన రికార్డులు లేకుండా ట్రామడాల్ లేదా ఇతర నియంత్రిత ఔషధాలను విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ అరుణ్ బాబు హెచ్చరించారు. ట్రామడాల్‌ను వైద్యుల సిఫార్సు లేకుండా అధిక మోతాదులో వినియోగిస్తే శ్వాసకోశ సమస్యలతో పాటు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన సదరు ఏజెన్సీల లైసెన్సులను రద్దు చేసేందుకు డీసీఏ ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించింది.




# భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక..

మొదటి పేజీ తరువాయి

ఘటనలో పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నాయి.పాకిస్థాన్ నౌక వ్యవహరించిన తీరు 1991లో భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది.ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పాకిస్థాన్ సైనిక యూనిట్లు సముద్రంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని ఆ దేశ రాయబారికి భారత్ సూచించింది. ఈ సందేశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖకు చేరవేయాలని ఆదేశించింది.ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత చార్జ్ డి అఫైర్స్ కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు అధికారికంగా నిరసన తెలియజేయాలని కేంద్రం సూచించింది.



# పాల దిగుబడి కోసం ప్రమాదకర ఇంజెక్షన్లు!

- సంతోష్ మెడికల్స్‌పై దాడి.. 40 లీటర్ల ఆక్సిటోసిన్ స్వాధీనం
- తారానగర్‌లోని సంతోష్ మెడికల్స్‌పై ఎస్ఓటీ, స్థానిక పోలీసుల సంయుక్త దాడి
- 200 మిల్లీలీటర్ల సామర్థ్యం కలిగిన 200 సీసాలు స్వాధీనం
- మెడికల్ షాప్ నిర్వాహకుడు అదుపులోకి.. చందానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు






**సామాన్యుడి అస్త్రం / చందానగర్:**

పశువుల నుంచి అధికంగా పాలు పితికేందుకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను అక్రమంగా విక్రయిస్తున్న దందాను సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసులు బట్టబయలు చేశారు. చందానగర్‌లోని తారానగర్ మార్కెట్ సమీపంలో ఉన్న 'సంతోష్ మెడికల్స్'పై మెరుపుదాడి నిర్వహించి భారీగా ఆక్సిటోసిన్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు.మెడికల్ షాప్ మాటున నిషేధిత ఇంజెక్షన్ల విక్రయం సాగుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు రంగంలోకి దిగారు. చందానగర్ పోలీసులతో కలిసి దుకాణంలో తనిఖీలు నిర్వహించగా, 200 మిల్లీలీటర్ల సామర్థ్యం కలిగిన 200 ఆక్సిటోసిన్ బాటిళ్లు బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ద్రావణం మొత్తం పరిమాణం 40 లీటర్లు ఉంటుందని పేర్కొన్నారు.పశువుల నుంచి అసహజంగా ఎక్కువ పాలు పొందేందుకు ఈ ఇంజెక్షన్లను వినియోగిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆక్సిటోసిన్‌ను అనుమతులు లేకుండా నిల్వ చేయడం, విక్రయించడం పశువుల ఆరోగ్యంతోపాటు ప్రజారోగ్యానికీ ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు.ఈ దందాతో సంబంధం ఉన్న మెడికల్ షాప్ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో పంచనామా నిర్వహించి, ఆక్సిటోసిన్ సీసాలను సీజ్ చేశారు. ఔషధాలు--సౌందర్య సాధనాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని వర్తించే సెక్షన్ల కింద చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.స్వాధీనం చేసుకున్న ఆక్సిటోసిన్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎంతకాలంగా విక్రయిస్తున్నారు? ఎవరెవరికి సరఫరా చేశారు? ఈ అక్రమ రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.అనుమతులు లేకుండా ప్రమాదకరమైన మందులు, ఇంజెక్షన్లను నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఓటీ అధికారులు హెచ్చరించారు. ప్రజలకు ఇటువంటి అక్రమ విక్రయాల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా ఔషధ నియంత్రణ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# నిమజ్జన వేళ.. నిఘా నీడ!

- మాధవాని కుంట వద్ద గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు
- సీసీటీవీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్‌తో భద్రత కట్టుదిట్టం
- - ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్‌పై పోలీసుల దృష్టి






**సామాన్యుడి అస్త్రం / ఐడీఏ బొల్లారం:**

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాధవాని కుంట వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు బందోబస్తుతోపాటు సీసీటీవీ నిఘా, భారీ క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఐడీఏ బొల్లారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ వి.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో, సీఎంసీ అధికారుల సహకారంతో నిమజ్జన ప్రదేశంలో అవసరమైన పనులు కొనసాగుతున్నాయి. కుంటకు వచ్చే ప్రధాన మార్గాలు, విగ్రహాలను దించే ప్రదేశాలు, భక్తులు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా నిమజ్జన ప్రక్రియ మొత్తాన్ని నిరంతరం పర్యవేక్షించనున్నారు.విగ్రహాల నిమజ్జనానికి భారీ క్రేన్లను అందుబాటులో ఉంచడంతోపాటు రాత్రివేళ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ప్రమాదవశాత్తు కుంటలోకి వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటు చేసి, నియంత్రిత మార్గాల ద్వారానే నిమజ్జన ప్రదేశంలోకి అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నారు.అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు.బుధవారం ఇన్‌స్పెక్టర్ వి.సుధీర్‌కుమార్ పోలీసు సిబ్బంది, సీఎంసీ అధికారులతో కలిసి మాధవాని కుంటను పరిశీలించారు. క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్, సీసీటీవీ కెమెరాలు, పార్కింగ్ ప్రాంతాలకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇంకా మిగిలిన పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి కూడా మాధవాని కుంటను సందర్శించి వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ స్తంభించకుండా అవసరమైన ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించడం, ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సిబ్బందిని మోహరించడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ భక్తుల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సీఎంసీ అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించాలని కోరారు.

# ఓయో రూమ్‌లో 'గంజాయి బజార్'.. రూ.9 లక్షల సరకు పట్టివేత!

- కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని హోటల్‌పై ఎక్సైజ్ శాఖ దాడి
- చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్న 17.1 కిలోల గంజాయి స్వాధీనం
- అస్సాంకు చెందిన ఇద్దరి అరెస్ట్.. సెక్యూరిటీ గార్డుల నుంచి డ్రగ్స్ దందాలోకి!






**సామాన్యుడి అస్త్రం / కొండాపూర్:**

ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి సెక్యూరిటీ గార్డులుగా పనిచేసిన ఇద్దరు వ్యక్తులు.. వచ్చే జీతం సరిపోవడం లేదంటూ అడ్డదారిలోకి వెళ్లారు. అస్సాం నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తూ చివరకు ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు చిక్కారు.కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని 'ఓయో హైలెట్స్' హోటల్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడి నిర్వహించారు. హోటల్ గదులను కేంద్రంగా చేసుకుని గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా సిద్ధం చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ దాడిలో సుమారు రూ.9 లక్షల విలువైన 17.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అస్సాంకు చెందిన ధీరజ్ దాస్ (39), రబాలి అలీ (25)లను అరెస్టు చేశారు. నిందితులు గతంలో హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసినట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో వెల్లడైంది.సెక్యూరిటీ గార్డులుగా వచ్చే జీతం తమ అవసరాలకు సరిపోవడం లేదనే కారణంతో త్వరగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాల వైపు మళ్లినట్లు అధికారులు తెలిపారు. అస్సాం నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, హోటల్ గదుల్లో నిల్వచేసి చిన్న పొట్లాలుగా విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఈ ముఠా నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న వారెవరు? నిందితులకు అస్సాంలో సరకు అందిస్తున్న ప్రధాన వ్యక్తులు ఎవరు? హైదరాబాద్‌లో వీరికి సహకరించిన స్థానిక నెట్‌వర్క్ ఉందా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హోటల్ గదిని గంజాయి విక్రయ కేంద్రంగా మార్చడం స్థానికంగా కలకలం రేపింది.

# 500 కెమెరాలు జల్లెడ..

## గ్వాలియర్‌లో చిక్కిన జ్యువెల్లరీ దొంగలు!




- బాలాజీ జ్యువెల్లర్స్ చోరీ కేసులో నలుగురి అరెస్ట్
- గోడకు రంధ్రం చేసి బంగారం, వెండి ఆభరణాల అపహరణ
- 59.220 గ్రాముల బంగారు బార్, రెండు కిలోల వెండి పట్టీలు స్వాధీనం
- నిందితులను కస్టడీలోకి తీసుకుని ఘటనాస్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్

**సామాన్యుడి అస్త్రం / చందానగర్:**

చందానగర్‌లోని బాలాజీ జ్యువెల్లర్స్‌లో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నేరం జరిగిన ప్రాంతం నుంచి నిందితులు ప్రయాణించిన మార్గాల వరకు సుమారు 500 సీసీటీవీ కెమెరాల దృశ్యాలను జల్లెడపట్టిన క్రైమ్, సీసీఎస్ బృందాలు నలుగురు నిందితులను గుర్తించాయి. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన నలుగురిని పీటీ వారెంట్ల ద్వారా కస్టడీలోకి తీసుకుని, చోరీ సొత్తులో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.గౌతమినగర్‌లోని శ్రీ బాలాజీ జ్యువెల్లర్స్ యజమాని నూకల శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు 2026 ఆగస్టు 1న క్రైమ్ నంబర్ 829/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 331(4), 305 కింద దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 31 అర్ధరాత్రి నుంచి ఆగస్టు 1 మధ్య గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం తాళాలు పగులగొట్టారు. షాపు వెనుక గోడకు అమర్చిన ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి, అక్కడున్న రంధ్రాన్ని పెద్దదిగా చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం స్టోరేజ్ గది తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు.కేసును సవాలుగా తీసుకున్న చందానగర్ క్రైమ్, సీసీఎస్ బృందాలు సుమారు 500 సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించాయి. సాంకేతిక ఆధారాలతో నిందితులు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లాయి. అయితే, మరో ఇంటి దొంగతనం కేసులో గ్వాలియర్ పోలీసులు వీరిని చందానగర్ పోలీసు బృందం చేరుకోవడానికి గంట ముందే అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసులో ఛోటూ అలియాస్ యోగేష్ మండేలియా (31), గోలు అలియాస్ రాజేష్ మండేలియా (35), అతుల్ శర్మ (30), శ్యామ్‌సుందర్ కుష్వాహ్ (30)లను నిందితులుగా గుర్తించారు. వీరిని పీటీ వారెంట్ల ద్వారా చందానగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు.పోలీసు విచారణలో చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను భింద్ జిల్లా కథా గ్రామంలోని అతుల్ శర్మ నివాసంలో దాచినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సమాచారంతో సెప్టెంబరు 13న మధ్యవర్తుల సమక్షంలో ఆ ఇంట్లో సోదాలు నిర్వహించారు.సోదాల్లో 59.220 గ్రాముల బరువున్న కరిగించిన బంగారు బార్‌తోపాటు సుమారు రెండు కిలోల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. మరో కిలో వెండిని ఆశిష్ అనే దుకాణదారుడికి విక్రయించినట్లు నిందితులు వెల్లడించారని, అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.నిందితులను గ్వాలియర్ నుంచి చందానగర్‌కు తీసుకొచ్చిన పోలీసులు ఘటనాస్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. చోరీకి ఎలా ప్రణాళిక రూపొందించారు? దుకాణంలోకి ఏ మార్గంలో ప్రవేశించారు? చోరీ సొత్తును ఎక్కడికి తరలించారు? అనే వివరాలను సేకరించారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.ఆర్సీ పురం డివిజన్ ఏసీపీ సీహెచ్.వై.శ్రీనివాస్‌కుమార్ పర్యవేక్షణలో చందానగర్ ఇన్‌స్పెక్టర్లు ఎ.శ్రీధర్‌కుమార్, కె.ప్రదీప్‌కుమార్, డిటెక్టివ్ క్రైమ్ సిబ్బంది, సీసీఎస్ బృందం కేసు ఛేదనలో కీలకంగా పనిచేసింది. సిబ్బందికి తగిన రివార్డులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# మేం అసెంబ్లీ నుంచి పోలేదు

**హైదరాబాద్: సామాన్యుడి అస్త్రం**

అసెంబ్లీ నుంచి తాము వెళ్లిపోలేదని,ప్రభుత్వం పథకం ప్రకారం తమను సభ నుంచి సస్పెండ్ చేసిందని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు."మేం అసెంబ్లీ నుంచి పోలేదు..పథకం ప్రకారం నువ్వే పంపించావు.సభ నుంచి మమ్మల్ని సస్పెండ్ చేసింది నువ్వే కదా. ఒక సెషన్ కాదు.. మొత్తం సెషన్ సస్పెండ్ చేశారు" అని హరీశ్ రావు అన్నారు.తమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీజేపీ కూడా కోరిందని ఆయన పేర్కొన్నారు. "మేం సభలో ఉండాలనుకుంటే.. సస్పెన్షన్ ఎందుకు ఎత్తివేయలేదు?" అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్నందుకే తమపై బురద రాజకీయాలు చేస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. "ఎంతకాలం ఈ అబద్ధాలు చెబుతారు?" అని ప్రశ్నించారు



# 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు



**అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు**
**పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌ఓసీ ఆరోపణ**
**గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు**
**47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు.22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# ఓటుకు నోటు కేసు.. రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ



**పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం**
**ఈ అంశంపై విచారణ జరిపే పరిధి ఏసీబీకి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు**
**నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది.తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు.గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# నిమజ్జన వేళ.. శాఖలన్నీ ఒకే తాటిపై!

- **భద్రతలో రాజీ వద్దు.. ట్రాఫిక్‌కు ఇబ్బంది రాకుండా చర్యలు: సీపీ రమేష్**
- **ఐడీపీఎల్, సూరారం నిమజ్జన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన**
- **పోలీసు--మున్సిపల్ శాఖల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్**
- **బందోబస్తు, ట్రాఫిక్, లైటింగ్, గజ ఈతగాళ్లపై ప్రత్యేక దృష్టి**





**సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ బ్యూరో :**

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ఒకే తాటిపై పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని, నిమజ్జన ప్రాంతాల్లో చిన్నపాటి లోపానికీ తావులేకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం సైబరాబాద్ పోలీసులు, సైబరాబాద్ మున్సిపల్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులతో ఏర్పాట్ల పురోగతిని సీపీ సమీక్షించారు.అనంతరం సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి.సృజన, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఐడీపీఎల్, సూరారం తదితర ప్రాంతాల్లోని నిమజ్జన కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ చేపట్టిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, విద్యుత్ దీపాలు, క్రేన్లు, గజ ఈతగాళ్లు, అత్యవసర బృందాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జనం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే పటిష్ఠ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సీపీ సూచించారు. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని మోహరించాలని ఆదేశించారు.నిమజ్జన కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు, బారికేడ్ల ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలని చెప్పారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలు, సాధారణ వాహనాలు ఒకే మార్గంలో చిక్కుకోకుండా ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికను అమలు చేయాలని అధికారులకు సూచించారు.చెరువుల వద్ద తగిన వెలుతురు ఉండేలా చూడాలని, ప్రమాదకర ప్రాంతాల్లో భక్తులు నీటిలోకి వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అత్యవసర సహాయక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని సీపీ రమేష్ పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ కోటిరెడ్డి, డీసీపీ రీతిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఎస్‌బీ డీసీపీ సువేంద్ర, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు, సిబ్బంది కూడా హాజరయ్యారు.

# సెప్టెంబర్ 17 వేడుకలు: కేంద్ర ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి.. రాష్ట్ర కార్యక్రమానికి రేవంత్ రెడ్డి



**సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు**
**కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**
**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ**
**రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ**
**సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

# ఉన్నత విద్య కోసం లండన్ వెళుతున్న మీనాక్షి నటరాజన్

**- లండన్ కు మీనాక్షి నటరాజన్.. తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్‌గా తమిళనాడు నేత చెల్లకుమార్?**
**- తెలంగాణ బాధ్యతలను మరో సీనియర్ నేతకు అప్పగించే పనిలో అధిష్ఠానం**
**- రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన చెల్లకుమార్**



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

దేశవ్యాప్తంగా పార్టీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణతో సహా పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లను, అలాగే ఐదారు రాష్ట్రాలకు నూతన పీసీసీ అధ్యక్షులను నియమించేందుకు సిద్ధమవుతోంది.ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య కోసం లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు వెళుతుండటంతో ఆమె స్థానంలో తమిళనాడు సీనియర్ నేత, మాజీ ఎంపీ డాక్టర్ ఎ. చెల్లకుమార్‌ను నియమించే అవకాశం ఉందనే వార్తలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.మీనాక్షి నటరాజన్ లండన్‌లో ఉండే ఈ పది నెలల కాలం ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాల్సి రావడంతో, క్రియాశీలకంగా ఉన్న తెలంగాణ బాధ్యతలను మరొక సీనియర్ నేతకు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది.

**ఎవరీ డాక్టర్ ఎ. చెల్లకుమార్?**

తమిళనాడుకు చెందిన ఈ సీనియర్ నాయకుడు 1991 (అన్నా నగర్) నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, 1996 (టి.నగర్) అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్ వర్గం) ఎమ్మెల్యేగా గెలిచారు. 2011లో టి.నగర్ నుంచి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణగిరి నుంచి కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించారు. గతంలో ఏఐసీసీ కార్యదర్శిగా, గోవా రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన అనుభవం చెల్లకుమార్‌కు ఉంది. గ్రౌండ్ లెవెల్ కేడర్‌తో మమేకమయ్యే సౌమ్యుడైన నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న వేళ పార్టీ-ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు అనుభవజ్ఞుడైన నాయకుడిని ఇన్‌చార్జ్‌గా తీసుకురావాలని అధిష్ఠానం భావిస్తోంది.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు

**రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు**

**రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య**

**అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ఎస్ నేతలకు నచ్చదని విమర్శ**



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

# కోటి ఎకరాలు కాదు.. కేవలం 3.60 లక్షల ఎకరాలే నిషేధిత జాబితాలో ఉన్నాయి



**22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ అసత్యాలు మాట్లాడుతోందన్న ఆది శ్రీనివాస్**

**బీఆర్ఎస్ పాలనలోని తప్పిదాలను సరిదిద్దుతుంటే ఓర్వలేకపోతున్నారని మండిపాటు**

**మాక్ అసెంబ్లీ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని విమర్శ**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాపై బీఆర్ఎస్ పార్టీ పచ్చి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ధరణి' పోర్టల్ ద్వారా కొందరు నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి పాలకులు చేసిన చారిత్రక తప్పిదాలను ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సరిదిద్దుతుంటే ఓర్వలేక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో ఏకంగా కోటి ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వాస్తవానికి హైకోర్టు ఆదేశాలు, తీవ్రమైన న్యాయపరమైన వివాదాలు ఉన్న కేవలం 3.60 లక్షల ఎకరాల భూములను మాత్రమే నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో ఉంచినట్లు స్పష్టం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఎక్కడైనా చిన్నపాటి లోపాలు తలెత్తితే వాటిని ప్రభుత్వం వెంటనే సరిదిద్దుతోందని తెలిపారుఅసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే సభకు హాజరుకాకుండా 'మాక్ అసెంబ్లీ'ల పేరుతో నాటకాలు ఆడటం బీఆర్ఎస్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సభాపతిని, దళిత వర్గాలను, విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అవమానిస్తూ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ధరణి అడ్డం పెట్టుకుని జరిగిన భూ దారుణాలను త్వరలోనే ఆధారాలతో సహా అసెంబ్లీ వేదికగా బట్టబయలు చేస్తామని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..

**తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం**

**రాష్ట్రంలో అత్యాధునికి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్న ముఖ్యమంత్రి**

**సెమీకండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ**



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది.రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు.ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాల్లో ఆయిల్ పామ్ పరిశ్రమల ఏర్పాటు



**సాగులో నష్టం రాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదే**

**మొదట జనగామ, మహబూబాబాద్ లోనే పరిశ్రమలు**

**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలుఏడోరోజు కొనసాగుతున్నాయి. అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు( మాట్లాడుతూ... 2026-27లో అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాసన పంటల సాకుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగు పెంపునకు 40-90 శాతం రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యాన పంటల సాగు పెంపునకు రూ. 150 కోట్లు, ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి రూ. 261 కోట్లు కేటాయించామని లెక్క చెప్పారు. బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు కేటాయించామని తెలిపారు.

**ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ అగ్రస్థానం**

రాష్ట్రంలో 88వేల మంది రైతులు 3.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు వివరించారు. 2021-22లో 2.74 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగుతో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాకులోకి తెచ్చామని వివరించారు. సోలార్ వ్యవస్థ ద్వారా రైతుల ఉద్యాసన పంటల సాగుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయిల్ పామ్ సాగులో నష్టం రాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేని తుమ్మల హామీ ఇచ్చారు. పదివేల ఎకరాల్లో పంట పండిస్తే పరిశ్రమ నిరంతరం నడుస్తోందని సూచించారు.ఇప్పటికే 14 పరిశ్రమలు గుర్తించాం.. నిర్మాణం జరుగుతోందన్నారు. ఆరు పరిశ్రమలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తొలుత ఉమ్మడి జిల్లాల్లో ఆయిల్ పామ్ పరిశ్రమలు(ం) ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంట ఎక్కువ వచ్చే జనగామ, మహబూబాబాద్ లో పరిశ్రమలు వస్తాయని ప్రకటించారు. కనీసం పది వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట వచ్చేలా చూడాలన్నారు. ఆరు నెలల్లో పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఆయిల్ పామ్ కు సంబంధించి మార్కెటింగ్ , ఎగుమతుల సమస్య లేదని వివరించారు. ఆయిల్ పామ్ కు ఎంఎస్ పీ అంశం కేంద్రం పరిధిలో ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# క్రీడా పాఠశాల నిర్మాణ పనులకు త్వరగా అనుమతులు ఇవ్వండి



**హైదరాబాద్,సామాన్యుడి అస్త్రం**

తన స్వగ్రామం ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేటలో మంజూరైన క్రీడా పాఠశాల నిర్మాణ పనులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.ఈ క్రమంలో ఈ విషయం గురించి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

**చేయూత దరఖాస్తులకు ఊరట..**

వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకోలేక నిరాశలో మునిగిపోయిన నిరుపేదలు, వృద్ధులకు సర్కారు ఊరటనిచ్చే శుభవార్త అందించిందా? నేటితో ముగియాల్సిన చేయూత నూతన పెన్షన్ల దరఖాస్తులకు ప్రభుత్వం మరో రోజు అదనపు గడువును ఎలా, ఎప్పటివరకు పొడిగించింది?తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'చేయూత' నూతన పెన్షన్ల దరఖాస్తు గడువును మరో రోజు పొడిగిస్తూ అధికార యంత్రాంగం ఉత్తర్వులు ఇచ్చింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడూ సంక్షేమ ఫలాలను అందుకోవడంలో వెనుకబడకూడదనే ఉద్దేశంతోనే ఈ వెసులుబాటు కల్పించారు.వరుస సెలవుల నేపథ్యంలో ఉపశమనం : గత మూడు రోజులుగా వరుసగా ప్రభుత్వ సెలవులు రావడంతో పలువురు అర్హులు దరఖాస్తులు సమర్పించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు నేటితోనే ముగియాల్సి ఉంది. ప్రజల వినతులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. రేపు సాయంత్రం 5:00 గంటల వరకు కొత్త దరఖాస్తులను స్వీకరించాల్సిందిగా నిర్ణయించింది.రేపు సాయంత్రం లోగా అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులను పూర్తిస్థాయిలో స్వీకరించాలని సెర్ప్ (రాజు-హా) సీఈవో దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. మండల, గ్రామ స్థాయి కేంద్రాల్లో ఎలాంటి సాంకేతిక ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గడువు పొడిగింపు అవకాశాన్ని అర్హులైన నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# తిరుమలకు చంద్రబాబు మాస్టర్ ప్లాన్..

**తిరుమలను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళిక**
**ఆరు కీలక సూత్రాలతో టీటీడీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం**
**భక్తులకు రూ. 2 లక్షల బీమా, వీఆర్ దర్శనం వంటి పలు నూతన సౌకర్యాల ప్రారంభం**
**తిరుమలలో నెట్-జీరో కర్బన ఉద్గారాల లక్ష్యం.. 100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక**
**5,000 కొత్త ఆలయాల నిర్మాణం, తిరుపతి ఆసుపత్రుల ఏకీకరణకు చారిత్రక నిర్ణయాలు**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**



తిరుమల క్షేత్రాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడుతూనే, భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడం, సమాజ సేవను దైవ సేవతో అనుసంధానించడం ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని (టీటీడీ) కొత్త పుంతలు తొక్కించేందుకు ఒక సమగ్ర, దీర్ఘకాలిక ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. తన తిరుమల పర్యటనలో భాగంగా రెండో రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, టీటీడీ భవిష్యత్ కార్యాచరణపై ఆయన సుదీర్ఘంగా వివరించారు.

**సేవయే దైవానికి మార్గం.. ఆరు సూత్రాల ప్రణాళిక**

"మానవ సేవే మాధవ సేవ" అనే సిద్ధాంతాన్ని పునరుద్ఘాటించిన చంద్రబాబు, శ్రీవారి కృపకు పాత్రులు కావాలంటే ప్రజలకు సేవ చేయడమే ఏకైక మార్గమని ఉద్ఘాటించారు. ఈ స్ఫూర్తితో టీటీడీ కార్యకలాపాలను ఆరు ప్రధాన సూత్రాల ఆధారంగా ముందుకు నడిపించనున్నట్లు తెలిపారు.

1. అన్నదానం: ఎన్టీ రామారావు ప్రారంభించిన ఈ మహత్తర కార్యక్రమాన్ని మరింత మెరుగుపరుస్తామని, రూ. 3,168 కోట్ల కార్పస్ ఫండ్‌తో భవిష్యత్తులోనూ నిరంతరాయంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భక్తుల సూచన మేరకు అన్నప్రసాదంలో మజ్జిగకు బదులు పెరుగు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

2. ప్రాణదానం, వైద్య సేవలు: తాను ప్రారంభించిన ప్రాణదానం ట్రస్ట్ సహా, తిరుపతిలోని స్విమ్స్, బర్డ్, రుయా, చిన్నపిల్లల ఆసుపత్రి, నూతన కార్డియాలజీ ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఆసుపత్రి, అరవింద్ కంటి ఆసుపత్రి వంటి అన్ని వైద్యశాలలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, ఒక అపెక్స్ బాడీని ఏర్పాటు చేస్తామన్నారు. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 800 మందికి పైగా రిజిస్టర్ చేసుకున్న శ్రీవారి వైద్య సేవకుల సేవలను వినియోగించుకొని, తిరుపతిని ఒక అత్యుత్తమ వైద్య కేంద్రంగా (ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎక్సలెన్స్) మారుస్తామని వివరించారు.

3. శ్రీవారి సేవకులు: ఇప్పటికే 12 లక్షల మంది నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు ఉన్నతస్థాయిలో శిక్షణ ఇచ్చి వారి సేవలను వైద్యం, విద్య, సాంస్కృతిక రంగాల్లో వినియోగించుకుంటామని తెలిపారు. వారి నైపుణ్యాలను సమాజ సేవకు అనుసంధానం చేస్తామన్నారు.

4. విద్యాదానం: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలను పూర్తిగా ప్రక్షాళన చేసి, ఉపాధి ఆధారిత విద్యను అందిస్తామన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను పీఎం-శ్రీ కింద అభివృద్ధి చేసి, తిరుపతిని పారిశ్రామిక, ఎగుమతుల హబ్‌గా మార్చేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తామని చెప్పారు.

5. దేవాలయాల నిర్మాణం: శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వ్యయంతో 5,000 చిన్న ఆలయాలను నిర్మిస్తామని ప్రకటించారు. నియోజకవర్గ కేంద్రాల్లో రూ. 5 నుంచి 10 కోట్లతో పెద్ద ఆలయాలు నిర్మించి, వాటికి ఈ చిన్న ఆలయాలను "హబ్ అండ్ స్పోక్" నమూనాలో అనుసంధానిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా హిందువులు అధికంగా ఉన్న నగరాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించే ప్రణాళికను కూడా వేగవంతం చేస్తామన్నారు.

6. వృక్షో గోవిందం, పర్యావరణ పరిరక్షణ: తిరుమల కొండపై ఇప్పటికే 89.4% ఉన్న పచ్చదనాన్ని మరింత పెంచుతామని, "పవిత్ర వనం" ఏర్పాటు చేసి ఔషధ మొక్కలను పెంచుతామన్నారు. నీటి సంరక్షణ చర్యలు పూర్తి చేసి, వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మారుస్తామని తెలిపారు.

**తిరుమల క్షేత్రంలో నూతన సౌకర్యాలు**

ఈ సందర్భంగా పలు నూతన సౌకర్యాలను చంద్రబాబు ప్రారంభించారు. రూ. 104 కోట్లతో టీసీఎస్ ఆధునీకరించిన శ్రీవారి మ్యూజియంను ఆయన సందర్శించారు. ఇందులో 14 గ్యాలరీలు, 8,000కు పైగా ప్రదర్శన వస్తువులు, 6,000 కళాఖండాలు ఉన్నాయని, దీని నిర్వహణ బాధ్యతలను కూడా ఐదేళ్ల పాటు టీసీఎస్ వారే చూసుకుంటారని తెలిపారు. అలాగే, ప్రతి భక్తుడికి ఎల్ఐసీ ద్వారా రూ. 2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఆధార్ ఆధారిత పేపర్‌లెస్ విధానంలో ప్రారంభించారు. క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల కోసం "దుర్లభ దర్శనం" పేరుతో 13 నిమిషాల వర్చువల్ రియాలిటీ (వీఆర్) అనుభూతిని, లైవ్ మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇది భక్తులకు మానసిక ప్రశాంతతను అందిస్తుందన్నారు. రిలయన్స్, భారత్ బయోటెక్ ఫౌండేషన్ అందించిన 32 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. వీటిని కూడా ఏసీ బస్సులుగా మార్చాలని సూచించారు.

**తిరుమల.. ఒక హీలింగ్ సెంటర్**

2003లో అలిపిరి వద్ద జరిగిన క్లైమోర్ మైన్ల దాడి నుంచి తనను కాపాడింది సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వర స్వామియేనని, ఇది తనకు పునర్జన్మ అని చంద్రబాబు భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. తిరుమల ఒక రాజకీయ వేదిక కాదని, కష్టాల్లో ఉన్నవారికి, ఒత్తిడికి గురైన వారికి సాంత్వన చేకూర్చే ఒక పవిత్రమైన "హీలింగ్ సెంటర్"గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. అందుకే ఇక్కడ రాజకీయాలను నిషేధించామని, భవిష్యత్తులోనూ ఆ పవిత్రతను కాపాడుతామని స్పష్టం చేశారు.

**తిరుపతి అభివృద్ధి, మౌలిక వసతులు**

తిరుపతి నగరాన్ని కూడా ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు స్కైవాక్ నిర్మాణం, రూ. 90 కోట్లతో కోర్టు కాంప్లెక్స్ నుంచి పద్మావతి అమ్మవారి ఆలయం వరకు 100 అడుగుల రహదారి నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని, వడమాలపేట వద్ద 5,192 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రాజెక్టుకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిని ఒక "వెడ్డింగ్ డెస్టినేషన్"గా అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయన్నారు.

**నెట్-జీరో, పారదర్శక పాలన**

తిరుమలను "నెట్-జీరో" కర్బన ఉద్గారాల క్షేత్రంగా మార్చడమే తన లక్ష్యమన్నారు. ఏడాదిన్నరలోగా సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ వంటి మార్గాల ద్వారా 100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసి, కొండపై అవసరాలకు వినియోగిస్తామన్నారు. వాడిన పూలతో అగరబత్తీలు, వ్యర్థాలతో బయో-గ్యాస్, నీటిని శుద్ధి చేసి ప్లాంటేషన్‌కు వాడటం వంటి "సర్క్యులర్ ఎకానమీ" విధానాలను అమలు చేస్తామన్నారు. టీటీడీ ఆస్తులు, ఆభరణాలు, నిధుల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో ఉంచి పూర్తి పారదర్శకత పాటిస్తామని, తామంతా ధర్మకర్తలమే తప్ప పెత్తనం చేయడానికి కాదని స్పష్టం చేశారు. శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోవడం ద్వారా సంస్థపై ఆర్థిక భారం తగ్గించి, పవిత్రతను కాపాడతామని, అనవసర నియామకాలకు స్వస్తి పలుకుతామని పేర్కొన్నారు. విర్రవీగిన వారు కాలగర్భంలో కలిసిపోయారని, ధర్మాన్ని, స్వామివారి పవిత్రతను కాపాడేందుకు కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మొత్తంగా, తన విజన్ తిరుమల క్షేత్రాన్ని భావితరాలకు ఒక ఆదర్శవంతమైన, పవిత్రమైన, సుస్థిరమైన దివ్యక్షేత్రంగా అందించడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం..



**ఏపీలో 9.09 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి**
**నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 3.63 లక్షల ఎకరాలపై నిషేధం యథాతథం**
**గ్రామసేవా ఇనాం భూములు 1.36 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్లకు కూడా పచ్చజెండా**
**నాలుగు వారాల్లోగా రెవెన్యూ రికార్డులు నవీకరించాలని అధికారులకు ఆదేశం**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**


ఆంధ్రప్రదేశ్‌లో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నిబంధనల మేరకు ఉన్న సుమారు 9.09 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫ్రీహోల్డ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, 2024 ఆగస్టులో విధించిన తాత్కాలిక నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేయడంతో లక్షలాది మంది రైతులకు ఊరట లభించినట్లయింది.ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం.. చట్టబద్ధంగా ఫ్రీహోల్డ్ హోదా పొందిన 7.85 లక్షల ఎకరాల అసైన్డ్ భూములతో పాటు, 1.36 లక్షల ఎకరాల గ్రామసేవా ఇనాం భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైంది. పొరపాటున అసైన్డ్‌గా వర్గీకరించిన 5,422 ఎకరాల ప్రైవేట్ పట్టా భూములకు కూడా ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చింది. అయితే, నిబంధనలు ఉల్లంఘించి ఫ్రీహోల్డ్‌గా మార్చిన 3.63 లక్షల ఎకరాలపై నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. వీటిలో తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు గుర్తించిన 64,000 ఎకరాలపై ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లతో లోతైన విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూముల చట్టానికి సవరణలు చేసి, 20 ఏళ్లు దాటిన వ్యవసాయ భూములు, 10 ఏళ్లు దాటిన ఇంటి స్థలాలను ఫ్రీహోల్డ్‌గా మార్చుకునే అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంత్రుల ఉపసంఘంతో సమీక్ష నిర్వహించి ఈ నిర్ణయం తీసుకుంది.రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు, నాలుగు వారాల్లోగా వెబ్‌ల్యాండ్ సహా అన్ని ఎలక్ట్రానిక్ రికార్డులను నవీకరించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇకపై రిజిస్ట్రేషన్ చేసే ముందు సబ్-రిజిస్ట్రార్లు తప్పనిసరిగా వెబ్‌ల్యాండ్ ఏపీఐ ద్వారా భూమి వివరాలను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

# ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

**ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం**
**శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు**
**ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం**
**ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్**
**రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.



# ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..



**నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి**
**వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు**
**డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు**
**పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం**
**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు**

**అమరావతి,సామాన్యుడి అస్త్రం**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ.8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్ఎస్ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం.చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ.13.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.శరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మలబద్ధకం సమస్యకు ఇదే బెస్ట్!

**మలబద్ధకం నివారణకు బొప్పాయి ఉత్తమమైన పండు**

**చిలగడదుంప, ఖప్లీ గోధుమ పిండితో మంచి ఫలితం**

**జీర్ణక్రియను సులభం చేసే అవిసె గింజలు, బాదం**

**ఫైబర్ ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు నీరు తాగడం ముఖ్యం**

**ఇవి పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ సూచనలు**



ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది ఎదుర్కొంటున్న సాధారణ సమస్య మలబద్ధకం. దీని నుంచి బయటపడటానికి సహజమైన మార్గాల కోసం చూసేవారికి ప్రముఖ పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ కొన్ని కీలకమైన సూచనలు చేశారు. మలబద్ధకాన్ని ఎదుర్కోవడానికి ఉత్తమమైన పండు 'బొప్పాయి' అని ఆమె స్పష్టం చేశారు. బొప్పాయిలో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్, ప్రొటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుందని వివరించారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది. బొప్పాయితో పాటు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచే మరికొన్ని ఆహార పదార్థాలను కూడా ఆమె సిఫార్సు చేశారు. వాటిలో కొన్ని:

**కూరగాయ:**

చిలగడదుంప. ఇందులో ఉండే అధిక ఫైబర్, నీటి శాతం మలాన్ని తేలికగా ముందుకు కదిలేలా చేస్తుంది.

పిండి: ఖప్లీ (ఎమ్మర్) గోధుమ పిండి. పొట్టుతో ఉండటం వల్ల ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది.

**గింజలు:**

అవిసె గింజలు. ఇవి పేగుల్లో కదలికలను సులభతరం చేస్తాయి.

**నట్స్:**

బాదం పప్పులు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం జీర్ణాశయ కండరాలకు విశ్రాంతినిస్తాయి. అయితే, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకున్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యమని సోనియా నారంగ్ నొక్కిచెప్పారు. నీరు సరిగ్గా తీసుకోకపోతే మలబద్ధకం సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడేవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని ఆమె స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు ఇవే!

**వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలపై నిపుణుల సూచనలు**

**విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మ వంటి పండ్లను తినాలని సలహా**

**వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడతాయని వెల్లడి**

**తేమ వాతావరణంలో వచ్చే వ్యాధుల నుంచి ఈ ఆహారాలు రక్షణ కల్పిస్తాయని నివేదిక**

**వేడిగా వండిన ఆహారం తినడం, పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని సూచన**



వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో తేమ శాతం పెరిగి, ఇన్ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం అధికమవుతుంది. ఈ సీజనల్ వ్యాధుల బారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించే కొన్ని ప్రత్యేక ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీరం సహజ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడే పలు ముఖ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్-సి పుష్కలంగా ఉండే నారింజ, నిమ్మ, ద్రాక్ష వంటి సిట్రస్ జాతి పండ్లు అగ్రస్థానంలో నిలుస్తాయి. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్లపై పోరాడే శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు. వీటితో పాటు వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వెల్లుల్లిలోని 'అల్లిసిన్' అనే సమ్మేళనం అద్భుతమైన యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే నట్స్, విత్తనాలు, తేనె వంటివి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారిస్తాయి. వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు బయటి ఆహారానికి, పచ్చి కూరగాయలకు దూరంగా ఉండి, ఇంట్లో తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార నియమాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండవచ్చని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ సూచనలు కేవలం ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మాత్రమేనని, ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా? సైన్స్ ఏం చెబుతోందంటే..!



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుంచి రాత్రి భోజనం వరకు గుడ్లు చాలా మంది ఆహారంలో భాగమయ్యాయి. అయితే ఒక సందేహం మాత్రం ఎప్పుడూ ఉంటుంది.. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టాలా? లేక బయట ఉంచినా సరిపోతుందా? కొందరు ఎప్పుడూ ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తే.. మరికొందరు గది ఉష్ణోగ్రతలో ఉంచుతారు. మరి ఇందులో సరైన పద్ధతి ఏది? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు? 2021లో 'ఫ్రాంటియర్స్ ఇన్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. గుడ్లను 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కొన్ని రోజులు ఉంచితే సాల్మొనెల్లా టైఫిమ్యూరియం అనే బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే ఆ బ్యాక్టీరియా పెరుగుదల గణనీయంగా తగ్గుతుంది. అంటే గుడ్ల భద్రత, తాజాగా ఉండటంలో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

**కొన్ని దేశాల్లో తప్పనిసరి?**

అమెరికా వంటి దేశాల్లో మార్కెట్‌లోకి వచ్చే ముందు గుడ్లను ప్రత్యేకంగా కడిగి శుభ్రం చేస్తారు. దీంతో వాటి పెంకుపై ఉండే సహజ రక్షణ పొర (క్యూటికల్) తొలగిపోతుంది. అది లేకపోవడంతో బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే అక్కడ గుడ్లను 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలోనే నిల్వ చేయాలని అమెరికా వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

**యూరప్, ఆసియా దేశాల్లో పరిస్థితి భిన్నం**

యూరప్, ఆసియాలోని చాలా దేశాల్లో గుడ్లను కడగకుండా విక్రయిస్తారు. దీంతో వాటి సహజ రక్షణ పొర అలాగే ఉంటుంది. అందువల్ల సాధారణంగా ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం ఉండదు. అయితే చల్లని, పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. భారత్ వంటి వేడి, తేమ ఎక్కువగా ఉండే దేశాల్లో మాత్రం ఫ్రిజ్‌లో ఉంచితే గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించేది ఫ్రిజ్**

ఎక్కువ ఉష్ణోగ్రతలో సాల్మొనెల్లా ఎంటెరిటిడిస్ వంటి బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఈ పెరుగుదల మందగిస్తుంది. అయితే తరచూ ఫ్రిజ్‌లో పెట్టడం, బయటకు తీయడం మంచిది కాదు. ఇలా చేస్తే గుడ్లపై తేమ ఏర్పడి బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఒకే ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం అత్యంత ముఖ్యం.

**ఇంట్లో గుడ్లను ఎలా నిల్వ చేయాలి?**

సూపర్‌మార్కెట్‌లో ఫ్రిజ్‌లో ఉంచిన గుడ్లను కొనుగోలు చేస్తే ఇంటికొచ్చిన తర్వాత కూడా ఫ్రిజ్‌లోనే పెట్టాలి. వాటిని ఫ్రిజ్ డోర్‌లో కాకుండా లోపలి షెల్ఫ్‌లో అసలు కార్టన్‌తోనే ఉంచడం మంచిది. ఎందుకంటే డోర్ తరచూ తెరవడం వల్ల అక్కడ ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది. స్థానికంగా లభించే కడగని గుడ్లను చల్లని వాతావరణంలో వారం రోజుల వరకు బయట ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ చేయాలంటే ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.

**ఫ్రిజ్‌లో పెడితే రుచి మారుతుందా?**

గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచితే వాటి రుచి లేదా పోషక విలువలు మారిపోతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉండటమే తప్ప వాటి రుచి లేదా పోషకాలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు.

# కిడ్నీలో రాళ్ల సమస్య?.. ఈ పండ్లు మీ డైట్‌లో చేర్చుకోండి!



**కిడ్నీలో రాళ్ల సమస్యను ఆహార నియమాలతో తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన**

**నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయని వెల్లడి**

**పుచ్చకాయ వంటివి శరీరానికి నీటిని అందించి రాళ్లను కరిగిస్తాయంటున్న నిపుణులు**

**యాపిల్, బేరి, బొప్పాయి వంటి పండ్లు కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయని సూచన**

**ఈ పండ్లు కేవలం నివారణకేనని, వైద్యుడి సలహా తప్పనిసరి అని హెచ్చరిక**

ప్రపంచవ్యాప్తంగా కిడ్నీలో రాళ్ల (కిడ్నీ స్టోన్స్) సమస్య పెరుగుతున్న నేపథ్యంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదులో నీరు తాగడంతో పాటు కొన్ని పండ్ల వినియోగం రాళ్లు మళ్లీ మళ్లీ ఏర్పడే ప్రమాదాన్ని నివారిస్తుందని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**కిడ్నీలో రాళ్లు ఎందుకు ఏర్పడతాయి?**

సాధారణంగా కిడ్నీలో రాళ్లు కాల్షియం ఆక్సలేట్ లేదా యూరిక్ యాసిడ్ వంటి ఖనిజ లవణాలు పేరుకుపోవడం వల్ల ఏర్పడతాయి. ఇవి మూత్రపిండాల్లో లేదా మూత్ర నాళాల్లో ఏర్పడి తీవ్రమైన నొప్పిని, ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్యకు జన్యుపరమైన కారణాలు ఉన్నప్పటికీ, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అయితే, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**సిట్రస్ పండ్ల ప్రయోజనాలు**

నిమ్మ, నారింజ, బత్తాయి వంటి సిట్రస్ జాతి పండ్లు కిడ్నీలో రాళ్ల నివారణకు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో 'సిట్రేట్' అనే రసాయనం అధికంగా ఉంటుంది. ఇది మూత్రంలోని కాల్షియంతో కలిసిపోయి, అది స్ఫటికాలుగా మారి రాళ్లుగా ఏర్పడకుండా అడ్డుకుంటుంది. అలాగే, మూత్రం జూ౦ స్థాయులని పెంచి రాళ్లు ఏర్పడటానికి ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ముఖ్యంగా రోజూ నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగడం చాలా సులభమైన, ప్రభావవంతమైన మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. నారింజ పండ్లలో కూడా సిట్రేట్‌తో పాటు విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అయితే, వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది.

**శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచే పండ్లు**


పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లలో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరానికి కావాల్సిన ద్రవాలు అంది, మూత్రం ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా మూత్రపిండాల్లోని ఖనిజ లవణాలు పలుచబడి, సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ఇది రాళ్లు ఏర్పడే ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఈ పండ్లలో సోడియం శాతం కూడా తక్కువగా ఉండటం వల్ల కిడ్నీల మొత్తం పనితీరుకు మేలు జరుగుతుంది.

**ఇతర మేలు చేసే పండ్లు**

యాపిల్, బేరి వంటి పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో 'ఆక్సలేట్' స్థాయులు చాలా తక్కువగా ఉంటాయి. కాల్షియం ఆక్సలేట్ రాళ్లతో బాధపడేవారికి ఈ పండ్లు సురక్షితమైనవి. బొప్పాయి కూడా అధిక నీటిశాతంతో పాటు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. ఇది కూడా కిడ్నీలకు స్నేహపూర్వకమైన ఆహారంగా పరిగణించబడుతుంది. అయితే, ఆహారంలో మార్పులు చేసుకునే ముందు ముఖ్యంగా కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వారి సలహా పాటించడం అత్యవసరం. ఈ పండ్లు కేవలం నివారణకు, ప్రమాదాన్ని తగ్గించడానికి మాత్రమేనని, ఇప్పటికే ఉన్న సమస్యకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్న మాట.

# రాగి రోజూ తినడం మంచిదేనా? నిపుణులు చెబుతున్న నిజం ఇదే!

రాగి పోషకాలతో నిండిన ఆరోగ్యకరమైన చిరుధాన్యాల్లో ఒకటి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు దృఢంగా ఉండేందుకు, రక్తహీనత తగ్గించేందుకు, రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారూ రాగిని ఎక్కువగా ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే రోజూ రాగినే ప్రధాన ఆహారంగా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమలు, బియ్యం, ఇతర చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరమని చెబుతున్నారు. రాగిలో కూడా కార్బోహైడ్రేట్లు ఉండటంతో పరిమిత మోతాదులోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.



# వరుస విజయాలతో బాక్సాఫీస్ క్వీన్‌గా మమిత బైజు..

మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా అంతటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో మమిత బైజు ఒకరు. గడిచిన ఏడాది కాలంలో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఏకంగా రూ. 1000 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను దాటడం విశేషం. కేవలం సహజమైన నటనతోనే కాకుండా తనదైన ప్రత్యేక శైలితో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ యంగ్ హీరోయిన్, ప్రస్తుతం సౌత్ సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ నటిగా దూసుకుపోతున్నారు.కేరళల ోని కొట్టాయంకు చెందిన మమిత బైజు 2016లో విడుదలైన 'పావడ' చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించినప్పటికీ, 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ చిత్రంలోని 'రీను' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో కూడా ఆమె బలమైన స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం.ఇక గత ఏడాది కాలంలో మమిత బైజు నటించిన సినిమాల బాక్సాఫీస్ సునామీ చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విజయ్ సరసన నటించిన సినిమా ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, ప్రదీప్ రంగనాథన్‌తో చేసిన చిత్రం రూ. 100 కోట్లు రాబట్టింది. అలాగే సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం రూ. 260 కోట్లు, ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా రూ. 55 కోట్లు సాధించాయి.



## వివాహ బంధానికి 20 ఏండ్లు..



కోలీవుడ్‌లో అత్యంత ఆదర్శవంతమైన స్టార్ దంపతులుగా పేరు తెచ్చుకున్న సూర్య, జ్యోతిక మరోసారి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. తమ వివాహం జరిగి 20 ఏళ్లు పూర్తి కావడంతో, తమ పిల్లలు మరియు అత్యంత సన్నిహితుల సమక్షంలో వారు ఘనంగా పెళ్లి వేడుకలు చేసుకున్నారునిజానికి సూర్య, జ్యోతికలు 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు. అప్పట్లో పెద్దల అంగీకారంతో ఘనంగా ఒక్కటైన ఈ జంట, ఇండస్ట్రీలోనూ రియల్ లైఫ్‌లోనూ బెస్ట్ కపుల్‌గా నిలిచింది. ఇప్పుడు సరిగ్గా ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారు మరోసారి ఈ వేడుకను జరుపుకున్నారు. ఈ సుందరమైన క్షణాలను 'ది సీక్వెల్ -- 20 ఏళ్ల ప్రేమ, పోరాటం' అంటూ అభివర్ణిస్తూ, ఇందుకు సంబంధించిన ప్రత్యేక వీడియోను వారు సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.

## మైత్రీ మూవీ మేకర్స్ '418 ది మూవీ'కి బ్రేక్..




ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కుతున్న ఆసక్తికర హారర్ థ్రిల్లర్ '418 ది మూవీ' విడుదలపై కీలక ప్రకటన వచ్చింది. ఇప్పటికే సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనగా.. ముందుగా నిర్ణయించిన తేదీకి ఈ చిత్రాన్ని విడుదల చేయడం లేదని చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా విడుదలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.'418 ది మూవీ'ని కేవలం దక్షిణాది ప్రేక్షకులకే పరిమితం చేయకుండా.. హిందీతో పాటు పలు భాషల్లో ఒకేసారి భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని భాషల్లో విడుదలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడానికి మరికొంత సమయం అవసరమవుతుండటంతో విడుదల తేదీని వాయిదా వేసినట్లు సమాచారం.

## 'మండాడి' నిర్మాతకు జాక్‌పాట్

తెలుగు నటుడు సుహాస్, తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మండాడి'. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడుదలైన కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 65 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది.




## 'కాటాలన్' (ఆహా) మూవీ రివ్యూ!

మలయాళంలో రూపొందిన ఒక యాక్షన్ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీకి వచ్చింది. ఆ సినిమా పేరే 'కాటాలన్'. ఆంటోని వర్గీస్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమాలో, సునీల్ .. కబీర్ దుహాన్ సింగ్ .. దుషారా విజయన్ కీలకమైన పాత్రలను పోషించారు. ఈ సినిమాకి పాల్ జార్జ్ దర్శకత్వం వహించాడు. మే 28వ తేదీన థియేటర్ లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది.'అనకొల్లి' అటవీ ప్రాంతంలో ఏనుగులు ఎక్కువగా ఉంటాయి. 'మారి' (సునీల్) చూపు ఆ అడవిపై పడుతుంది. ఏనుగు దంతాలతో అక్రమ వ్యాపారం చేయడానికి అతను ఒక అనుచర వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటాడు. పోలీసులు .. ఫారెస్టు అధికారులు తన వ్యాపారానికి అడ్డుపడకుండా వాళ్లకి పెద్దమొత్తంలో లంచాలు ముట్టజెపుతుంటాడు. ఆ చుట్టుపక్కల ఉండే గిరుజనులు తన పట్ల



భయంతో బ్రతికేలా చేస్తాడు.అయితే 'ఎడ్డీ' (కబీర్ దుహాన్ సింగ్) మాత్రం 'మారి' వ్యాపారానికి అడ్డుపడుతూ ఉంటాడు. తన తండ్రిని చంపిన ఏనుగులపై కోపం ఒక పక్కన .. తన బిజినెస్ ను 'మారి దెబ్బకొడుతున్నాడనే ద్వేషం ఒక పక్కన 'ఎడ్డీ'ని బలమైన శత్రవుగా మారుస్తాయి. 'ఎడ్డీ'కి రాజకీయ నాయకులతో .. పోలీస్ అధికారులతో దగ్గర సంబంధాలు ఉండటంతో, ఒక చురుకైన అనుచరుడు కావాలనే ఉద్దేశంతో 'ఆంటోని'( ఆంటోని వర్గీస్)ను 'మారి రంగంలోకి దింపుతాడు. ఆంటోనీ వచ్చిన తరువాత 'మారి' బిజినెస్ పుంజుకోవడంతో, ఆంటోనీని అడ్డుతప్పించాలని ఎడ్డీ గ్యాంగ్ నిర్ణయించుకుంటుంది.

## 'ఎల్లమ్మ' సినిమాలో హీరోయిన్‌గా 'రోమాంచకం' బ్యూటీ?

టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్‌లలో ఒకటైన 'ఎల్లమ్మ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ వేణు ఎల్దండి దర్శకత్వంలో, రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రంలో హీరోయిన్‌గా యువ నటి అనంతిక సనిల్‌కుమార్ నటించబోతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం.'బలగం' వంటి ఎమోషనల్ అండ్ సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత వేణు ఎల్దండి తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో నాయిక పాత్రకు తగినట్టుగా అనంతిక సనిల్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. నటనకు ఆస్కారం ఉన్న ఈ



పాత్రలో ఆమె తన పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను మెప్పించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.